# పరంధామయ్య నవ్వు

ఎండలో మిలమిల మెరుస్తూ జెర్రిపోతులా పోయే తారు రోడ్డుకు ఒక వేపు విశాలమైన ప్రభుత్వ కార్యాలయం, ఇంకోవేపు జీవితభీమా ఆఫీసు. మధ్యాహ్నం ఒంటిగంటా రెండు మధ్య ఈ రెండు ఆఫీసుల్లోంచి బయటపడ్డ కొందరు ఉద్యోగుల్ని ఒక ఇరానీ హోటల్ వారధిలా కలుపుతుంది. భీమా ఆఫీసులోని కృష్ణస్వామినీ, ఎదురుగా ఉన్న కార్యాలయంలోని పరంధామయ్యనూ ఆ హోటల్‌లో గోడవారకు కిటికీ దగ్గర ఉన్న ఒక చిన్నటేబుల్ కలుపుతుంది. అలా ఇద్దరూ మాట్లాడేసుకుంటూ, చేతులు ఊపుకుంటూ, అప్పుడప్పుడు చేతులు తగిలి చాయ్, దానితోపాటే బోలెడంత ఆత్మీయత ఒలకబోసుకుంటూ కూర్చున్న సమయంలో చూసిన వారికి అసూయతోపాటు కాస్తంత ఆశ్చర్యంకూడా కలక్కమానదు. ఇద్దరిదీ ఒక ఆఫీసా కాదు. ఒక ఊరంతకన్నా కాదు. ఒక కాలనీలో నివాసమా అంటే అదీకాదు. సమవయస్కులా అంటే అదీకాదు. కానీ రోజుకో పాతకాలం పాట పట్టుకుని, దాని పల్లవిమీద మాట్లాడేసుకుంటూ ఉంటారు. పక్క టేబుల్ మనుష్యులెవరైనా టైమ్ అయిపోయిందని హడావిడి పడిపోతూ ఉంటే వీళ్ళు ఇద్దరూ ఇహలోకంలోకి ఊడిపడి, ఎవరి ఆఫీసులకి వాళ్ళు వెళ్ళిపోతారు.

ఎప్పుడూ పరధ్యాన్నంగా కనిపించే పరంధామయ్య నవ్వు పసివాడి బోసినవ్వులా ఉంటుంది. కింద పలువరసలో ఒక పన్ను ఊడిపోయినట్టుగా ఉండి నవ్వితే ఏదో చాక్లెట్ కంపెనీవాళ్ళ వాణిజ్య ప్రకటనలో కుందేలు బొమ్మ జ్ఞాపకం వస్తుంది. ఎదురెదురుగా ఉన్న ఆఫీసుల్లో పనిచేస్తూ ముఖపరిచయం కాసింత ఉన్నా, ఒకటి రెండు సంఘటనలు ఇద్దరినీ చాలా దగ్గరగా తీసుకురాకపోతే ఈ స్నేహానికి ఎవరైనా ఆశ్చర్యపోవడం సహజమే అనిపిస్తుంది.

ఎప్పుడూ ఆఫీసు వేళ ముగిశాక బస్సుల వెంటపడి హడావిడిపడే పరంధామయ్య ఆ రోజు బాగా చీకటి పడ్డాక మధ్యంతరంగా నిలబడిపోయాడు, రోడ్డుమీద దిగాలుగా. స్వామి అలా స్కూటరుమీద పోతూ పరంధామయ్యను కదిపి, కుదిపి "ఇక్కడే ఉండిపోయారేం?"

అని అడిగాడు. "ఆ హోటల్‌లో ఎవరో బేగమ్ అఖ్తర్ గజల్ రికార్డు వేస్తున్నారు. అటు చెవిపెట్టి వింటూఉంటే నా బస్సు కాస్తా పోయింది. మళ్ళా ఒక గంటకికానీ లేదు..."అని సిగ్గూ ఏడుపూ కలగాపులగం చేసి నవ్వాడు. "సరే కూర్చోండి" అని స్కూటరు మీద చాదర్ ఘాట్ బ్రిడ్జి దాటించి ఇంకో రూట్‌లో వచ్చే కొత్తపేట బస్సును ఎక్కించాడు స్వామి చూస్తూ ఊరుకోలేక.

ఇంకోసారి పెట్రోల్ బంక్ దగ్గర స్వామి స్కూటర్ స్టార్ట్ చేస్తూ ఉంటే ఎదురుగా సిటీ బస్సు ఆగింది. రేగిన జుత్తూ, నలిగిన చొక్కా, సీమకుక్క చెవిలా చిరిగి వేలాడుతున్న జేబు ఆ వాలకంతో ఫుట్‌బోర్డు మీద ముసిరిన ప్రయాణీకుల్ని చీల్చుకుంటూ బస్సులోంచి రాలిపడ్డాడు పరంధామయ్య. సిటీకి దూరంగా ఎక్కడో కొత్తపేట జంక్షన్ దగ్గర ఇల్లు కట్టుకున్నట్లు చెప్పిన జ్ఞాపకం. మరి కొత్తపేట వేపే పోతున్న ఆ బస్సులోంచి అంత శ్రమపడుతూ బస్సుపోయినదిశగానే నడుచుకుంటూ, తనలోతనే ఏదో అనుకుంటూ ఎందుకు పోతున్నట్లు? తను స్కూటర్ని పరంధామయ్య పక్కనే నిలిపి "కూర్చోండి వెనక, నేను సలీంనగర్‌లో పెళ్ళికి వెళ్ళాలి. మీరెంతదాకా?" అని అడిగిన స్వామిని చూసి చిన్న పిల్లాడిలా బోలెడు సిగ్గుపడిపోయాడు. చెప్పక తప్పదా? అన్నట్లు కాస్త సందేహిస్తూ "ఎంత చమత్కారంగా కొట్టేశాడు స్వామీ" అని చిరిగిన జేబును తడుముకున్నాడు.

"దొంగవాణ్ణి మెచ్చుకోవడం తరువాత, ఎంత పోయిందేమిటి?"

"మూడు నాలుగు మించి నా దగ్గర సాధారణంగా ఉండవు. ఇవాళ చిన్నదానికి టెక్స్ట్ పుస్తకాలు కొనడంకోసం ఓ పది ఎక్కువ తెచ్చాను. పుస్తకాలింకా రాలేదుట. అందుకని జేబులో ఉన్నాయి. వాడి అదృష్టం".

"మరి ఈ నడక ఎందాకా?"

"ఇంటికే"

"కొత్తపేట దాకానా!"

"జేబులో చూసుకుంటే బస్సు టిక్కెట్టుకి.."

"ఎంత మొహమాటం, మీ ఇల్లు బంగారంగానూ. స్కూటర్ వెనక కూర్చోండి సూపర్ బజార్ దగ్గర బస్సు ఎక్కిస్తాను. ఈ ఐదు రూపాయలు ఉంచుకోండి" అని స్వామి ఆ సాయంత్రం పరంధామయ్యని గట్టెక్కించాడు ఆ ఆపదలోంచి.

మర్నాడు ఉదయాన్నే ఎదురుగా ఐదు రూపాయల నోటు అందిస్తూఉన్న పరంధామయ్యను చూసి "లంచి టైమ్‌లో మీరు ఇవ్వొచ్చుకదా. ఇలా ఉదయాన్నే హడావిడి పడకపోతే" అని మందలించాడు స్వామి. ఇలాంటి సంఘటనలే కొన్ని కేవలం ముఖ పరిచయాన్ని ఆత్మీయతగా మార్చిపారేశాయి.

ఎంతకీ రాని బస్సు కోసం ఎదురు చూస్తూనో, ఎక్కడాగుతుందో తెలియనివ్వకుండా ఏమార్చే బస్సువెంట ఒలింపిక్ రన్నర్‌లా పరుగు తీస్తూనో, బంద్ రోజుల్లో బస్సులు ఆగిపోయినప్పుడు ఉస్సురని నడుస్తూ పోతూనో కనిపించేవాడు పరంధామయ్య. ఒంటికాలుమీద నిలుచుని బస్సులో పోగల స్థలం దొరికితే పొంగిపోయి ఆ రోజంతా ఎంతో అదృష్టవంతుడిలా తృప్తిపడేవాడు. అతని దైనందిన జీవితంలో చాలా భాగం బస్సుల్లో గడపడం వల్లనేమో అతని మాటల్లో కూడా తరచూ వింత వింత ఉపమానాలు వినిపించేవి. "ఆపదలో చస్తే తెరుచుకోని అత్యవసర ద్వారంలాగ" అనే వాడు. "మందు పెట్టకపోయినా మాడుపగలకొట్టే ఖాళీ ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లాగ" అనేవాడు.

ఒక రోజు స్కూటరు మీద కొంత దూరం లిఫ్టు ఇస్తున్న స్వామికి ఒక కోరిక కలిగింది. కాస్త పక్కదారి పట్టించి అతని ఇంటికి పరంధామయ్యను తీసుకెళ్లాలని మెల్లగా అతనికి చెప్పి ఒప్పించాడు కూడా. అంతలోనే "స్వామీ! స్వామీ! కాస్త ఆపు నీకు పుణ్యం ఉంటుంది" అని భుజం తట్టాడు. స్కూటర్ ఆపి, ఎందుకీ ఆపడం అని ప్రశ్నార్థకంగా చూస్తున్న స్వామి మొహంలోకి జాలిగా చూస్తూ "మరోలా అనుకోకు, నీ ఇంటికి ఇంకోమారు తీరిగ్గా వస్తాకానీ- అదుగో మా కొత్తపేట బస్సు, అనుకోకుండా దొరికింది. ఈరోజైనా కాస్త వేళగా ఇంటికెళ్తాను. రేపు మా పెద్దాడికి లెక్కలపరీక్ష.." అంటూ స్కూలు పిల్లాడిలా ఆ బస్సులోకి ఉరికి విజయగర్వంతో కిటికీలోంచి మొహం పెట్టి టాటా చెప్పేశాడు. అలాటి బాధ చూసి ఊరుకోలేక స్వామి ఒక రోజు "సైకిలో, మోపెడో ఉంటే మీకు ఎంతో బాగా..." అని నసిగాడు. దానికి జవాబుగా "నడచి పోయే దూరమా కాదు. సైకిల్ తొక్కే వయసా కాదు, పిక్కబలం కావాలి. మోపెడ్ నడపాలంటే పెట్రోలు ధర..." అంటూ కాస్త సాగదీసి తన సంసారం బాధ విడమరచి చెప్పడం నేరం అన్న భావంతో ఆగిపోయాడు పరంధామయ్య. అలా అతన్ని ఇబ్బంది పెట్టినందుకు స్వామి మనసులో నొచ్చుకున్నాడుకూడా.

కొన్నేళ్ళు గడిచాక-ఒకసారి ఎక్కడో కాలేజీ పుస్తకాల షాపు ముందు నిల్చున్న పరంధామయ్యను చూసి "ఇక్కడేంపని!" అని పలకరించాడు స్వామి. ఇంతలో దీపకళికలా మెరిసిపడే యువకుడు షాపులోంచి పుస్తకాల పార్సిల్‌తో వాళ్ళ దగ్గిరగా వచ్చి నించున్నాడు. "స్వామీ! వీడే మా పెద్దాడు. స్కాలర్ షిప్ వచ్చింది. బి.టెక్ లో చేరాడు" అని పరిచయం చేస్తూ వుంటే వినయంగా స్వామిని చూసి నమస్కరించాడు పెద్దాడనబడే ఆ చిన్నవాడు.

ప్రమోషన్ మీద నిజామాబాద్ బ్రాంచికి పంపుతే స్వామికి భాగ్యనగరాన్ని విడచి నాలుగేళ్ళు గడవక తప్పలేదు. హైదరాబాద్‌కి తిరిగి పోస్టింగ్ వచ్చే ముందు ఒక సాయంత్రం బోధన్ బస్సు స్టాండ్ కూడలి దగ్గర నిలుచున్నాడు. సరిగ్గా తనకు ఎదురుగా వచ్చి నిలుచుని నవ్వుతున్న యువకుణ్ణి చూసి ఎక్కడో చూసినట్లనిపించినా జ్ఞాపకం రాక అవస్థపడిపోతున్నాడు. "నేనే అంకుల్... పరంధామయ్యగారి..." అంటున్న ఆ యువకుడి మాటకు అడ్డువచ్చి "ఆ

జ్ఞాపకం వచ్చింది. నాన్నగారు బావున్నారా?" అని భుజం మీద చెయ్యి వేశాడు స్వామి. "ఎస్.ఎల్. ఇంజనీర్స్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా చేరి ఇక్కడ ఉద్యోగం చేస్తున్నాను" అన్నాడు యువకుడు. "ఎస్.ఎల్. ఇంజనీర్స్ సంస్థ చాలా పేరు ప్రతిష్ఠలున్న కంపెనీ. అందులో ఉద్యోగం దొరకడం అంటే మాటలు కాదు. చాలా అదృష్టం" అంటూ భుజం తట్టి అభినందించాడు స్వామి. ఆ సమయంలో ఒక సలహాకూడా ఇవ్వబోయాడు. "ఇంకా మీ నాన్నగారికి ఎంత లేదన్నా ఐదేళ్లు సర్వీసు ఉంటుందేమో. ఒక్క మోపెడ్ కొనిస్తే..." అన్న స్వామి మాటలు పూర్తికానివ్వకుండానే ఆ చిన్నవాడు హాయిగా నవ్వుతూ "సరిగ్గా నేనాపనే చేసొచ్చాను కిందటి వారం వెళ్ళినప్పుడు. మా ఇంటి దగ్గర మైదానంలో డ్రైవ్ చెయ్యడంకూడా నేర్పేశాను. ఇప్పుడు ధైర్యంగా ఆఫీసుకెళ్ళి వస్తున్నారు కూడా..." అన్నాడు గర్వంగా. స్వామి మనసు చాలా తేలిక పడింది. ఇక అతని కష్టాలు గట్టెక్కినట్లే అని తృప్తిగా ఎదుటనే ఉన్న పరంధామయ్య కొడుకుని మరోసారి అభినందించాడు. "నీలాటి కొడుకుంటే తండ్రి కింకేంలోటు" అన్నాడు.

స్వామి హైదరాబాద్‌కి తిరిగి వచ్చి హెడ్ ఆఫీసులో చేరిన సాయంత్రం ఏదో పని మీద, బ్యాంకు కాలనీ వరకూ వెళ్ళి తిరిగి వస్తూ స్కూటర్ స్టార్ట్ చెయ్యబోయాడు. కిటకిటలాడుతూ కొత్తపేట పోతున్న బస్సు క్వాస దూరంలో ఆగింది. అందులోంచి హడావిడిగా దూకేసిన పరంధామయ్య కనిపించాడు. ఎదురుగా ఉన్న స్వామిని చూసి ఆశ్చర్యపోతూ "ఎన్నాళ్ళకి కలిశాం... స్వామీ బాగున్నావా?" అంటూనే ఏదో సందేహంతో కలవర పడిపోతున్నాడు.

"ఏమైంది... ఏంకావాలి" అన్న స్వామి కళ్ళలోకి చూస్తూ "నీకు పుణ్యం ఉంటుంది... ముందు నన్ను ట్రూప్ బజారు వేపు తొందరగా పోనీ..." అని దీనంగా వేడుకున్నాడు. అలా అతను చొరవగా లిఫ్టు అడగడం అరుదైన విషయమే.

స్వామి ఇంక ఎదురు ప్రశ్న వెయ్యకుండా పరంధామయ్యని స్కూటరు వెనక కూర్చోబెట్టుకుని ట్రూప్ బజార్ దిశగా దూసుకుపోయాడు. ఆ సాయంకాలం రోడ్ల రద్దీలోంచి పరంధామయ్య చిన్నగా నసుగుతున్న మాటలేవీ స్పష్టంగా చెవిని సోకడం లేదు. ఒక సందు మొదట్లో ఉన్న షాపు దగ్గర స్కూటరు ఆపమని వెనక నుంచి వీపు తట్టి, ఆగీ ఆగడంతో చంగున కిందకి దూకేశాడు పరంధామయ్య. అక్కడ పార్క్ చేసిన మోపెడ్‌కి తాళం తీస్తున్న పరంధామయ్య స్వామికో చిక్కు ప్రశ్నలా కనపడ్డాడు. అర్థం కాక అతని వేపు చూస్తూ ఉంటే "థ్యాంక్యూ స్వామీ! నిన్ను కష్టపెట్టాను. వెధవది... ఆ కొత్తపేట బస్సు కళ్ళపడితేచాలు ఒళ్ళూ పై తెలీక చిన్నపిల్లాడిలా అందులోకి ఉరికెయ్యడం అలవాటైపోయి... బండి తెచ్చిన మాటే...." అని పూర్తి చెయ్యకుండా బోలెడంత సిగ్గు పడిపోయాడు. ఆ నవ్వు బోసిగా కుందేలు నవ్వినట్లే ఉంది.

(ఈనాడు ఆదివారం, 13-12-1992